క్లుప్తంగా

నేడు ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లుగా వేణుగోపాల్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్ గుప్తా, సమ్మయ్య యాదవ్, బండ అనిత మహేందర్, మహేష్ కుమార్, వెంకటేష్ ప్రమాణం చేయనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు.

అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

నిజాంపేట్: బాచుపల్లిలోని ప్లెజెంట్ విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు సుంకినేని శ్రీధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన కార్యాలయంలో ఒక పక్క క్లబ్ హౌస్, టేబుల్ టెన్నిస్ గదితో పాటు అధునిక హంగులతో అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వేణుగౌడ్, సెక్రటరీ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి దుర్గారెడ్డి, కోశాధికారి సదాశివరెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక



బోనాల ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ నేత కేఎం ప్రతాప్, కురుమ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మాజీ డీసీసీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత కె.ఎం.ప్రతాప్ అన్నారు. కుత్బుల్లాపూర్ గ్రామంలోని మల్లన్న ఆలయంలో ఆదివారం శ్రావణ మాస బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించగా ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఉత్సవాల్లో కురుమ సంఘం పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఆదర్శనగర్‌లోని శ్రీపోచమ్మ ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బీజేపీ నేత, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ ఆయన్ని సత్కరించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎస్.వి.ఎన్. చారి, శ్రీకాంత్ రెడ్డి, బాపిరెడ్డి, దయాకర్ చారి, శేషారెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబశివ రావ్, దుర్గేష్, సుధాకర్, శివ శంకర్, సోమేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.



ఆదర్శనగర్ పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కూన శ్రీనివాస్‌గౌడ్

ఈరోజైనా కలుస్తారా.?

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య దోబూచులాట

- ఎమ్మెల్యేను కలుద్దామని ఎమ్మెల్సీ వస్తే.. ఎమ్మెల్యే రాలేదు
- తిరిగి ఎమ్మెల్సీ నివాసానికి ఎమ్మెల్యే వెళ్తే అందుబాటులోకి రాని ఎమ్మెల్సీ
- ఒకరింటికి ఒకరు వెళ్తే తప్పించుకుంటున్న ఇరువురు



ఎమ్మెల్యే వివేకానంద నివాసంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు గత కొద్ది కాలంగా ఎడమొహం.. పెడమొహంగా ఉంటూ వస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన 115 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో వివేకానంద్‌ను కుత్బుల్లాపూర్ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్పొరేటర్ రావుల శేషగిరి, నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం పాండులతో పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే వివేకానంద్ నివాసానికి వెళ్లారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడి గంట పాటు వేచి చూశారు. అయితే ఎమ్మెల్యే ఎంతకీ రాకపోవడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు 'సాక్షి'తో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై తనకెంతో గౌరవముందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్యేను కలవడానికి వచ్చానని తెలిపారు. అయితే ఆయన రాకపోవడంతో వెళ్తున్నానని చెప్పారు. తనకు పార్టీ పటిష్టతే ముఖ్యమని.. ఎవరు అభ్యర్థిగా ఉన్నా వారి విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పాదయాత్ర నుంచి వచ్చేసరికి ఎమ్మెల్సీ వెళ్లిపోయారు: ఎమ్మెల్సీ వివేకానంద్

ఇదే విషయాన్ని ఎమ్మెల్యే వివేకనంద్‌ను సాక్షి వివరణ కోరగా.. మూడు రోజుల క్రితం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలవడానికి ఆయన నివాసానికి వెళ్లానన్నారు. అయితే ఎమ్మెల్సీ అక్కడ లేరన్నారు. ఆ తర్వాత ఫోన్‌లో మాట్లాడుదామని ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదన్నారు. ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంతో ఎమ్మెల్సీ పీఏను సంప్రదించి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరానన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. ఆదివారం తాను పాదయాత్రలో ఉన్న సమయంలో ఎమ్మెల్సీ తమ నివాసానికి వచ్చినట్లు తెలిసిందన్నారు.

◆ తాను పది నిమిషాల్లో వస్తున్నానని ఇంట్లోని సిబ్బందికి చెప్పానన్నారు. ఇదే విషయం వారు ఎమ్మెల్సీకి చెప్పడంతో ఆయన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. తాను ఇంటికి వచ్చేసరికి ఆయన వెళ్లిపోయారని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు నివాసానికి వెళ్లానన్నారు. అయితే పలు శుభకార్యాల్లో ఉన్నట్లు పీఏ ద్వారా చెప్పించారని తెలిపారు. సోమవారం 9గంటలకు కలుస్తారని ఎమ్మెల్సీ పీఏ చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే వీరిద్దరు కలుస్తారా లేదా అనేది సస్పెన్స్‌గా మారింది.

ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయ రాణే



జీడిమెట్ల: కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా గెలుస్తుందని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయ రాణే అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో డా.ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో సునీల్ దత్తాత్రేయ పలు అంశాలు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గానికి ఇన్‌చార్జ్‌గా వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో బీజేపీకి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. బీజేపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఒక సైనికునిగా పని చేసి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రతి కార్యక్రమం యొక్క ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలో చాలా వరకు పెండింగ్ సమస్యలు ఉన్నాయని సమస్యలపై బీజేపీ పోరాడాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.ఎస్.వాసు, బక్కా శంకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నందనం దివాకర్, గిరివర్ధన్, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు దమ్ముంటే డబుల్ ఇళ్లు వెంటనే కేటాయించాలి..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో 70శాతం ఇళ్లను దమ్ముంటే స్థానికులకు కేటాయించాలని మల్లారెడ్డి ఎమ్మెల్యే వివేకానందకు సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని సమస్యలు నెరవేర్చకుండానే అన్ని పనులు చేశానని చెప్పడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్‌ను ఓడించేది బీజేపీ యేనని ఆయన తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

చింతల: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన సీపీఎస్ రద్దు, పీఆర్సీ కమిటీ నియామకం, ఉపాధ్యాయుల బదిలీల ప్రమోషన్లు వంటి సమస్యలపై జరిగే మహాధర్నాల జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్, యుఎస్‌పీసీటీపీటీఎఫ్ తదితర సంఘాల నేతలు అన్నారు. ఆదివారం పీఆర్సీ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం రెండు పర్యాయాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. పీఆర్సీ కమిటీ వేయడంలోనూ, అదే విధంగా సీపీఎస్‌ విషయంలోనూ తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడేందుకు ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 1వ తేదీన జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా ఉపాధ్యాయ సంఘాలు నేతలు జయసింహారెడ్డి, బ్రహ్మాచారి, కవిత, రమేష్ కుమార్, రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ పాటలతో సమాజంలో చైతన్యం నింపారు



గద్దర్ సంస్మరణ సభకు హాజరైన ఆయన కుమార్తె వెన్నెల తదితరులు

చింతల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ తన పాటల ద్వారా సమాజంలో చైతన్యాన్ని నింపారని వక్తలు కొనియాడారు. భగత్‌సింగ్‌నగర్‌లో శనివారం రాత్రి గద్దర్ సంస్మరణ సభ నిర్వహించగా ఆయన కుమార్తె వెన్నెల, మాజీ ఐఏఎస్ అధికారి జేబీ రాజు, గద్దర్ సన్నిహితుడు యాదగిరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సత్యం, కార్యక్రమ నిర్వాహకులు నిషాని చందర్, శ్యామల, మల్లేష్ తదితరులు మాట్లాడుతూ.. భగత్ సింగ్‌నగర్ వ్యవస్థాపకుడు దివంగత పెంచల్‌రెడ్డికి గద్దర్‌తో సన్నిహిత సంబంధాలు ఉండేవని పేర్కొన్నారు.

◆ తెలంగాణ పోరాటంతో పాటు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు చేసిన ఉద్యమాల్లో గద్దర్ తనదైన ముద్ర వేశారన్నారు. గేయాలు, నృత్యాలతో తెలంగాణ సమాజంలో ఉత్తేజాన్ని నింపారన్నారు. గద్దర్ చిత్రపటానికి నివాళుర్పించిన అనంతరం దళిత చైతన్య కళామండలి చంద్రన్న బృందం సభ్యులు నర్సింగ్ రావు పోచయ్య, నీలమ్మలు గద్దర్ పాడిన పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జిల్లా వెంకటేష్, సంక్షేమ సంఘం సభ్యులు బీసు వెంకటేశం గౌడ్, వరదరాజు, నారాయణ్ రెడ్డి, పరుశురామ్, సహదేవ్, రాములు, రాజిరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయనగర్ కాలనీ అధ్యక్షుడిగా ఎండీ రియాజ్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.డి.రియాజ్ ఎన్నికయ్యారు. కాలనీలో మొత్తం 330 మంది ఓటర్లు ఉండగా, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ధ్యాహ్నం వరకు జరిగిన ఎన్నికల్లో 302 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి ఉంగరం గుర్తుపై పోటీ పడిన రియాజ్ సమీప ప్రత్యర్థి చంద్రశేఖర్‌గౌడ్‌పై 48 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా మల్లం శ్రీనివాస్‌గౌడ్ 46 ఓట్ల అధిక్యతతో విజయం సాధించారు. విజయనగర్ కాలనీ అభివృద్ధికి కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ సహకారంతో కృషి చేస్తామన్నారు. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని నియమిస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు.

నియామకం

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లికి చెందిన పాతూరి వెంకటరావును తెలంగాణ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదివారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. టీటీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి

ఎమ్మెల్యే వివేకానంద్



హమీద్ బస్తీలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఆదివారం ఆయన సుభాష్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా హమీద్ బస్తీ రాళ్లకంచెలో రూ.50 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, మసీద్-ఏ, మెహ్రాజ్‌భవనం, భగత్‌సింగ్‌నగర్ పోచమ్మ ఆలయం సమీపంలో రూ.18లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కాలనీ, బస్తీలో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ రంగారావు, నాయకులు డాక్టర్ హుస్సేన్, యూసఫ్, వెంకట్ స్వామి, ప్రభాకర్, రవి, నవీన్ యాదవ్, శివ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన జీపీఆర్ వెంచర్ ప్లాట్ల ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు సమస్యలను నివేదిస్తూ..

కుత్బుల్లాపూర్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో సీసీ రోడ్లు వేయించాలని, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్సీ రాజు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

◆ బౌరంపేట్‌లోని జీపీఆర్ వెంచర్‌లో ఓ వ్యక్తి ప్లాట్ల ఓనర్లను ఇళ్ల నిర్మాణ విషయంలో అడ్డుకుంటున్నాడని.. సదరు స్థలం తనకు చెందినదిగా పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్నారని.. పాట్ల ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన వారు ఈ విషయమై పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తి ఆక్రమణలపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పంచాయతీ కార్మికులకు ఉచిత బీమా

మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని 4,779 మందికి ప్రయోజనం

సాక్షి, మేడ్చల్ జిల్లా: పల్లె ప్రగతిని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం ఆతర్వాత ప్రతి పంచాయతీకి ఒక ట్రాక్టరు అందజేసింది. అవసరమైన పారిశుద్ధ్య కార్మికుల నియమించుకోవాలని సూచించింది. పంచాయతీల్లో జనాభాను బట్టి మార్గదర్శకాలకు అనుగుణంగా కార్మికుల నియామక ప్రక్రియ చేపట్టాయి. పాలకవర్గాలు, కార్మికులను నియమించుకుని వారికి నెల రూ.8,500 వరకు వేతనాలు అందజేస్తున్నారు. కేవలం వేతనం తప్ప ఇతర సామాజిక భద్రత లేకపోవటం వల్ల పంచాయతీ కార్మికుల్లో ఆందోళన ఉండేది. వివిధ కారణాల వల్ల మరణిస్తే కనీసం బీమా సౌకర్యం కూడా లేని పరిస్థితి. మరీ ముఖ్యంగా రోజువారీగా గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రం చేయటం, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతరత్రా పారిశుద్ధ్య పనుల కారణంగా వీరు అనారోగ్యం పాలైన సందర్భాలున్నాయి. చికిత్సల పరంగా వీరికి సహకారం అందే పరిస్థితి లేదు. ఈక్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి పంచాయతీ కార్మికుడికి ఉచితంగా ప్రభుత్వమే బీమా చేయాలని నిర్ణయించి ఆ దిశగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలలో 4,779 మంది పారిశుద్ధ్య కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.అలాగే,శివారు జిల్లాలలోని మొత్తంగా ఉన్న 619 గ్రామ పంచాయతీలపై ఏటా రూ.6.50 కోట్ల వరకు అదనపు భారం పడనున్నట్లు తెలుస్తోంది.

పంచాయతీ నుంచే ప్రీమియం...

రైతు బీమా పథకంలో పట్టాదారు అయిన రైతు మరణిస్తే మరణం ఎలాంటిదైనా రూ.5 లక్షల బీమా సొమ్ము అందుతోంది. అలాగే, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కూడా ఇదే విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం కింద నమోదైన పంచాయతీ కార్మికుడు మరణిస్తే వారి నామినీకి లేదా కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము అందనుంది. బీమా ప్రీమియం సొమ్ము పంచాయతీ నిధుల నుంచే చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల బీమా ప్రీమియం సొమ్ము చెల్లించేలా తక్షణం చర్యలు చేపట్టాలని డీపీవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఇక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు మరణిస్తే గతంలో అంత్యక్రియల కోసం రూ.5 వేలు ప్రభుత్వం ఇచ్చేది.. దాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది కూడా గ్రామ పంచాయతీ నిధుల నుంచే ఇవ్వాల్సి ఉంటుంది.

మార్గదర్శకాలు రాగానే...

ప్రభుత్వం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల బీమాపై నిర్ణయం తీసుకుంది. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తాం. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణే కీలకం... అనునిత్యం ప్రజలకు సేవలందించే పారిశుద్ధ్య కార్మికులకు మేలు జరగుతుందని భావిస్తున్నాం.

- రమణమూర్తి , జిల్లా పంచాయతీ అధికారి,మేడ్చల్-మల్కాజగిరి

జనావాసాల మధ్య పశువులు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



సాయినగర్ బస్టాప్ ప్రాంతంలో తిష్ట వేసిన పశువులు..

నిజాంపేట్: జనావాసాల మధ్య పశువులు తిష్ట వేయడంతో స్థానికులకు అసౌకర్యంగా ఉంటోంది. పదుల సంఖ్యలో గుంపులుగా ఉండటంతో ఎక్కడ తమను పొడుస్తాయోనని భయబ్రాంతులకు గురవుతున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధి సాయినగర్ బస్టాప్ ప్రాంతంలో ప్రతిరోజు ఇరవై వరకు పశువులు గుంపుగా చేరుతున్నాయి. అక్కడే తిష్ట వేయడంతో స్థానికంగా బస్సుల కోసం వేచి చూసేవారు ఇబ్బందులు పడుతున్నారు.. అంతే కాకుండా సమీపంలోని ఇళ్ల వద్దకు వస్తున్నాయి.. అసలు పశువులు ఎవరికి చెందినవి, ఎందుకు వదిలి పెడుతున్నారన్నది తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బస్టాప్ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం..

పశువులు గుంపులగా బస్టాండ్ ప్రాంతంలో ఉండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. పశువుల పేడతో ఆ ప్రాంతమంతా నిండిపోతోంది, వాటిని తొలగించకపోవడంతో దోమల బెడద తీవ్రమవుతోందని చుట్టు పక్కల ఇళ్ల వాసులు పేర్కొంటున్నారు..

బెంబేలెత్తుతున్న మహిళలు, స్కూల్ పిల్లలు..

స్థానికంగా రాకపోకలు సాగించే మహిళలతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై ఒక్కోసారి పశువుల మీదకు వస్తుంటంతో ఎక్కడ తమపై దాడి చేసి కొమ్ములతో పొడుస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడు సాయినగర్ బస్టాప్ ప్రాంతంలో తిష్ట వేస్తున్నాయి.

యజమానులపై చర్యలు తీసుకోవాలి..

పశువులను ఇష్టానుసారంగా రోడ్లపైకి వదిలి ఇతరులకు ఇబ్బందులు సృష్టిస్తున్న యజమానిపై కార్పొరేషన్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. స్థానికంగా గుంపులుగా సంచరిస్తడటంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఇళ్ల వద్దకు సైతం గుంపులుగా వస్తున్నాయి.

- చంద్రయ్య, స్థానికుడు.

అపరిశుభ్రంగా మారుతోంది..

పశువులను కొట్టాల్లో కట్టేయాలి గాని బహిరంగ ప్రదేశాల్లో వదలిపెట్టకూడదు. సాయినగర్ బస్టాప్ ప్రాంతంలో తిష్ట వేదయంతో అపరిశుభ్రంగా మారుతోంది. బస్సుల కోసం వేచి చూసేవారిపై పశువులు ఒక్కోసారి మీదకు వస్తున్నాయి. విద్యార్థులైతే అటుగా వెళ్లేందుకు జంకుతున్నారు. పశువులు స్థానికంగా రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రామనర్సయ్య, స్థానిక వాసి